క్లుప్తంగా

పంచముఖి గణపతికి గరిక పూజ



పంచముఖ ఆంజనేయ గణపతి

అల్లిపురం: నీలమ్మవేపచెట్టు రోడ్డులో గత నెల 18వ తేదీ నుంచి శ్రీ గణపతి నీలమాంబ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణపతి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం పంచముఖ ఆంజనేయ గణపతికి గరిక పూజ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు భీశెట్టి గోపికృష్ణ, ఆకుల రాజు, తారకేష్, లక్ష్మణ్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షపై అవగాహన



అమ్మవారివీధిలో జగనన్న ఆరోగ్య సురక్షపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

అల్లిపురం: జగనన్న ఆరోగ్య సురక్ష పై అవగాహనా కార్యక్రమం 33వ వార్డులో చురుగ్గా కొనసాగుతోంది. ఇందులో భాగంగా గురువారం వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు, కన్వీనర్లు, వలంటీర్లు, ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు. బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. వెంకటేశ్వరమెట్ట సచివాలయం పరిధిలో ఇంటింటి సర్వేలో భాగంగా వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు రంధి గోపీకృష్ణ, టెలికాం అడ్వయిజరీ కమిటీ సభ్యుడు పాల శ్రీహరిరెడ్డి, భీశెట్టి రాజు, ఏఎన్‌ఎం, ఆశ వర్కరు ఎం.అనురాధ, సూపర్‌వైజర్ కె.రమేష్, వైద్య విద్యార్థులు సంధ్య, రాజకుమారి వైద్య పరీక్షలు నిర్వహించారు. త్వరలో జరగనున్న వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని వారు కోరారు.

ఆటో డ్రైవర్లకు ఖాకీ చొక్కాల పంపిణీ



ఆటోడ్రైవర్లతో రంథిగోపి, భీశెట్టి రాజు

అల్లిపురం: నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు సీతంరాజు సుధాకర్ సహకారంతో ఆటో డ్రైవర్లకు ఖాకీ చొక్కాలు పంపిణీ చేశారు. 33వ వార్డు అధ్యక్షుడు రంధి గోపికృష్ణ ఆధ్వర్యంలో వార్డులో నీలమ్మవేపచెట్టు ప్రాంతం నీలమాంబ ఆటోస్టాండ్, ఎంజీఎం హై స్కూల్ ఆటో స్టాండ్, బంగారుమెట్ట కాలనీలోగల ఆటోస్టాండ్‌లో ఆటో డ్రైవర్లకు ఖాకీ చొక్కాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సీనియర్ సచివాలయ కన్వీనర్లు ఆదారి వెంకట మహేష్, భీశెట్టి రాజు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దృష్టికి వార్డు సమస్యలు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ 35వ వార్డులో పలు సమస్యల పరిష్కారానికి ఆ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు గురువారం ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే స్పందించి త్వరలోనే సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో వార్డు కార్పొరేటర్‌తో పాటు దుర్గాలమ్మ దేవస్థానం చైర్మన్ నాయిన మల్లిబాబు, ధర్మకర్తలు భక్తి మంగరాజు, వార్డు వర్కింగ్ ప్రెసిడెంట్ మహంతి గౌరీశంకర్ ఉన్నారు.

ఆరోగ్యానికి భరోసా

- మౌలాలీపంజా అర్బన్ హెల్త్ సెంటర్‌లో నేడు జగనన్న సురక్ష వైద్య శిబిరం
- విభాగాల వారీగా ఆరోగ్య పరీక్షలకు ఏర్పాట్లు



ఏర్పాట్లపై సూచనలు ఇస్తున్న జోన్ 4 జోనల్ కమిషనర్ శివప్రసాద్



ఏఎన్‌ఎంలు,ఆశాలకు విధులు కేటాయిస్తున్న డాక్టర్ సింధు

డాబాగార్డెన్స్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజల ఆరోగ్యానికి భరోసాగా నిలుస్తోంది. ఇందులో భాగంగా శుక్రవారం 39వ వార్డు పరిధిలోని మౌలాలీపంజా అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో వైద్య శిబిరం జరగనుందని హెల్త్ సెంటర్ వైద్యాధికారి సింధు తెలిపారు. ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్ని ప్రారంభించనున్నారు.

అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలోని 7 సచివాలయాల నుంచి 1500 మంది వరకూ జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి హాజరుకానున్నారు. సచివాలయాల వారీగా క్లస్టర్‌లో వలంటర్లీతో విస్తృతంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అలాగే ఏఎన్‌ఎం, ఆశా సిబ్బందితో ముందుగా వైద్య పరీక్షలు చేశారు. వీరిలో వైద్య శిబిరానికి రావాల్సిన అవసరం ఉన్న వారికి టోకెన్లు అందజేశారని డాక్టర్ సింధు తెలిపారు.

ఏడుగురు వైద్యులతో పరీక్షలు

ఈ శిబిరంలో ఏడుగురు వైద్యులు రోగులకు పరీక్షలు చేయనున్నారు. రోగులందరికీ ఇప్పటికే టోకెన్లు అందజేశారు. టోకెన్లు లేనివారు సైతం వైద్యం చేయించుకునే అవకాశం కల్పిస్తున్నామన్నారు. జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్, పీడియాట్రిక్, ఆప్తామాలజీ, డెంటల్, గైనిక్, ఛాతీ వైద్య నిపుణులు శిబిరంలో సేవలందిం చనున్నారు.

ఏర్పాట్లు పరిశీలించిన జెడ్సీ శివప్రసాద్

జీవీఎంసీ జోన్ 4 జోనల్ కమిషనర్ శివప్రసాద్ హెల్త్ సెంటర్ వద్ద వైద్య శిబిరం ఏర్పాట్లను గురువారం సందర్శించారు. శిబిరానికి హాజరయ్యే వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. టెంట్లు, కుర్చీలు, తాగునీటి వసతి ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. రోగుల పేర్ల నమోదు, వైద్య పరీక్షలు చేయడానికి వీలుగా వేర్వేరుగా కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నారు.

వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి



ఇంటి దగ్గర్లో స్పెషలిస్టు వైద్యులతో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్. సింధు పిలుపునిచ్చారు. ఉచితంగా ఆరోగ్య పరీక్షలు, వైద్య పరీక్షలు, మందులు అందిస్తామన్నారు. మెరుగైన వైద్యం అవసరమైతే వారిని మల్టీస్పెషాలిటీ ఆస్పత్రులకు తరలించి ఉచితంగా వైద్యం అందించనున్నాం. టోకెన్లు ఉన్నవారు, లేని వారు కూడా శిబిరంలో వైద్య సేవలు పొందవచ్చు.

–డాక్టర్ సింధు, అర్బన్ హెల్త్ సెంటర్

పలువురికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం



37వ వార్డుకి చెందిన వద్దాది రాజు భార్యకు ఆర్థిక సాయంఅందజేస్తున్న ఎమ్మెల్యే



చికిత్స పొందుతున్న 38వ వార్డుకు చెందిన రాజుకు ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే

డాబాగార్డెన్స్: నియోజకవర్గ పరిధిలో పలువురు ఆరోగ్య సమస్యలతో ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న రోగులకు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఆర్థిక సాయం అందజేశారు. ఇటీవల వాసుపల్లి ప్రజాదర్బార్‌లో వచ్చిన వినతుల మేరకు ఆయన స్పందించారు. 38వ వార్డు చిన్నమ్మవారి వీధిలో నివశిస్తున్న దొలపిల్లి రమణమ్మ పక్షవాతంతో మంచాన పట్టడంతో కుటుంబ పోషణ కష్టతరంగా ఉన్న నేపథ్యంలో ఎమ్మెల్యే వాసుపల్లి తన సొంత నిధుల నుంచి రూ.5వేలు అందజేశారు. 34వ వార్డు కొబ్బరితోటలో నివశిస్తున్న దొలపిల్లి పావని బ్లడ్ ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతున్న నేపథ్యంలో రూ.5వేలు అందజేశారు. 31వ వార్డు కృష్ణాగార్డెన్స్‌లో నివశిస్తున్న పోలవరపు శ్రీధర్‌కు ఇటీవల ప్లాస్టిక్ సర్జరీ జరిగింది. స్కిన్ ఎలర్జీతో బాధపడతున్న దృష్ట్యా మందుల ఖర్చులకు రూ.5వేలు అందజేశారు. 38వ వార్డులో రాజు అనే వ్యక్తికి ఇటీవల జరిగిన ప్రమాదంలో కుడి కాలికి గాయం కావడంతో కేర్ ఆస్పత్రిలో శస్త్రచికిత్స జరిగింది. పరామర్శించి మందుల ఖర్చులకు రూ.5వేలు అందజేశారు. 30వ వార్డులో పిల్లా అప్పయ్య తండ్రి అప్పలరాజు కంటికి దెబ్బ తగలడంతో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా శస్త్ర చికిత్స జరిగింది. కుటుంబ పోషణ కష్టతరంగా ఉన్న దృష్ట్యా రూ.5వేలు అందజేశారు. 37వ వార్డు రెల్లివీధిలో వద్దాది రాజు భార్య అనారోగ్యంతో ఉన్న దృష్ట్యా వైద్య ఖర్చుల కోసం రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ఆయా వార్డుల నాయకులు పాల్గొన్నారు.

ప్రజలతో మమేకం



సమావేశంలో మాట్లాడుతున్న వాసుపల్లి

డాబాగార్డెన్స్: వైఎస్సార్‌సీపీ ఎప్పటికప్పుడు వినూత్న కార్యక్రమాలు రూపొందిస్తోంది. ఇప్పటికే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తూ, ప్రజలకు పార్టీ నేతలు దగ్గరయ్యారు. ప్రజల సమస్యలను పరిష్కరించే విధంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తుండగా, ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి? అంటూ ప్రజల మధ్యకు వెళ్లేందుకు నిర్ణయించింది. ఇందులో భాగంగా కార్యక్రమంపై ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ గురువారం తన కార్యాలయంలో కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, జిల్లా, రాష్ట్ర పార్టీ నాయకులు, గృహసారథులు, మండలాధ్యక్షులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నాయకులకు దిశా నిర్దేశం చేశారు. ప్రతి సచివాలయాన్ని సందర్శించాలని, పార్టీ జెండా ఆవిష్కరించాలని, ప్రతి రోజూ 100 మంది నాయకులకు పార్టీ టోపీలు అందజేయాలని, పార్టీ జెండాలు పంపిణీ చేయాలని, ముఖ్య నాయకులతో రాత్రి భోజనం, బస చేయాలన్నారు. మరుసటి రోజు వేకువజామున సచివాలయ పరిధిలో 10 ఇళ్లకు వెళ్లి జగనన్న ప్రభుత్వం మేనిఫెస్టోలో పేర్కొన్న పథకాలు అమలు జరుగుతున్నాయా? లేదా తెలుసుకోవాలన్నారు. ప్రభుత్వ పనితీరుపై స్పందన ఎలా ఉంది? తదితర అంశాలను ప్రజలను అడిగి తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు పలు వార్డుల కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, క్లస్టర్ ప్రెసిడెంట్స్, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, స్టేట్ డైరెక్టర్లు, రాష్ట్ర, జిల్లా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సిరులతల్లికి ఘనంగా సహస్ర తులసి పూజ



సహస్ర తులసి పూజలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి గురువారం సహస్ర తులసీపూజ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయ దాతలు పాల్గొన్నారు. పంచామృతాభిషేక సేవలో 22 మంది ఉభయదాతలు పాల్గొన్నారు. శ్రీచక్రానవవర్ణార్చన లక్ష్మీహోమంలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ధర్మకర్తలు మీసాల అశోక్‌కుమార్, బి.అనురాధ, ఎస్.సతీష్, ఎన్ఎస్ఎస్ సుబ్రహ్మణ్యం, ఎస్.సురేష్, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ పాల్గొన్నారు.

నేడు క్షీరాభిషేక సేవ..

కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించనున్నారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దర్ని అనుమతించనున్నారు. పూజలో పాల్గొనదలచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు.

35వ వార్డులో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే



గాజులవీధిలో సర్వే చేస్తున్న ఏఎన్‌ఎంలు

జగదాంబ: జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే జీవీఎంసీ 35వ వార్డులో గురువారం ప్రారంభమైంది. వాస్తవానికి ఈనెల ఎనిమిదవ తేదీన ప్రారంభం కావల్సి ఉన్నప్పటికీ ముందుస్తుగా ప్రసాద్‌గార్డెన్స్ డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య కేంద్రం వైద్యులు కె. సందేష్ ఆధ్వర్యంలో ముందుగానే ప్రారంభించి సర్వే చేస్తున్నారు. ప్రసాద్‌గార్డెన్స్, కల్లుపాకలు, గాజులవీధిలో సర్వే మొదలుపెట్టారు. సర్వేలో భాగంగా ప్రజలకు బీపీ, షుగర్ తోపాటు పలురకాల పరీక్షలు చేస్తున్నారు. ఇలా సుమారు 20 రోజుల వరకు సర్వే నిర్వహించి రోగుల టోకెన్లు ఇస్తారు. ఈనెల 28న జరిగే వైద్యశిబిరానికి వీరంతా హాజరయ్యేలా ప్రణాళిక రూపొందిస్తున్నారు.

గీత్ సంగీత్ విభావరి పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మేయర్

డాబాగార్డెన్స్: నగరానికి చెందిన సాంస్కృతిక సంస్థ గీత్ సంగీత్ ఆధ్వర్యంలో శనివారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో నిర్వహించనున్న సంగీత విభావరికి సబంధించి పోస్టర్‌ను గురువారం నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ గీత్ సంగీత్ వ్యవస్థాపకుడు, మాజీ ఏడీసీపీ మహ్మద్ ఖాన్ నిర్వహణలో 3 గంటల నాన్‌స్టాప్ సినీ సంగీత విభావరి నిర్వహించనున్నట్లు చెప్పారు. నగరానికి చెందిన గాయనీ గాయకులు కార్యక్రమంలో పాల్గొని హుషారైన తెలుగు, హిందీ గీతాలు ఆలపిస్తారని చెప్పారు. మేయర్ భర్త గొలగాని శ్రీనివాసరావు, వీరేంద్రయాదవ్ పాల్గొన్నారు.

నిరాశ్రయులకు చేయూత



ఆహారపదార్థాలు పంపిణీ చేస్తున్న పోలీసులు

కంచరపాలెం: ప్రపంచ నిరాశ్రయుల దినోత్సవం సందర్భంగా ఏయూటీడీ సంస్థ ఆధ్వర్యంలో అండర్ ది స్టార్స్ క్యాంపెయిన్ కార్యక్రమం నిర్వహించారు. జ్ఞానాపురం ఎర్నిమాంబ ఆలయం దరి బీఆర్‌టీఎస్ బస్టాప్ వద్ద గురువారం రాత్రి కంచరపాలెం ఫిఫ్త్ టౌన్ ఎస్ఐ రవికిషోర్ నిరాశ్రయులకు ఆహారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏయూ టీడీ సంస్థ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. ఒక రోజు నిరాశ్రయు లు పడుతున్న బాధలు తెలుసుకుని ప్రపంచానికి తెలియజేయడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో ఏయూటీడీ సంస్థ కార్యదర్శి ప్రగడ వాసు, ఆర్‌పీఎఫ్ సీఐ రామకృష్ణ, జీఆర్‌పీఎస్ సీఐ ధనుంజయ్ పాల్గొన్నారు.


శిక్షణ పొందిన విద్యార్థినులకు ధ్రువపత్రాల అందజేత



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థినులు

డాబాగార్డెన్స్: ఏపీఎస్ఎస్‌డీసీ, విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన బ్యూటీషియన్, ఎంఎస్ ఆఫీస్, జావా ఫుల్ స్టేక్ కోర్సు పూర్తి చేసిన విద్యార్థినులకు గురువారం సర్టిఫికెట్లు అందజేశారు. కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థినులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ శోభారాణి అభినందించారు. 133 మంది విద్యార్థినులు ఆయా కోర్సుల్లో శిక్షణ పొందారు. కార్యక్రమంలో జేకేసీ కో ఆర్డినేటర్ డి అరుణపద్మ, స్కిల్ కాలేజ్ కో ఆర్డినేటర్ డాక్టర్ హైమావతి, ఏపీఎస్ఎస్‌డీసీ కో ఆర్డినేటర్ కె ప్రశాంతి పాల్గొన్నారు.

బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రోషా

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాలలో గురువారం కళాశాల హెల్త్ కమిటీ, ఎన్ఎస్ఎస్ యూనిట్ల సంయుక్త ఆధ్వర్యంలో బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శోభారాణి మాట్లాడుతూ ప్రతి ఏడాది అక్టోబర్ నెలను బ్రెస్ట్ క్యాన్సర్ అవేర్‌నెస్ మంత్‌గా నిర్వహిస్తారన్నారు. ఎక్కువ శాతం మహిళలకు బ్రెస్ట్ క్యాన్సర్ వచ్చే అవకాశం ఉంటుందని చెప్పారు. డాక్టర్ హోమిబాబా క్యాన్సర్ హాస్పటల్ అండ్ రీసెర్చ్ సెంటర్ ప్రివెంటీవ్ అంకాలజీ విభాగాధిపతి డాక్టర్ రోషా బ్రెస్ట్ క్యాన్సర్ రావడానికి కారకాలు, రాకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలు, చికిత్స విధానాలను వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్-3 ప్రోగ్రామింగ్ ఆఫీసర్ డాక్టర్ జె.లావణ్య, హెల్త్‌క్లబ్ ఇన్‌చార్జ్ ఎ.జ్యోతి, మైక్రోబయాలజీ అధ్యాపకురాలు డాక్టర్ టి.వరలక్ష్మి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

పోలమాంబ, దుర్గమాంబ ఉత్సవాలు ప్రారంభం



చాటింపు నిర్వహిస్తున్న డప్పు కళాకారుడు



పోలమాంబ అమ్మవారు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ 37వ వార్డు పరిధి శబరినగర్‌లో వెలసిన పోలమాంబ, దుర్గమాంబ అమ్మవార్ల మహోత్సవాలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. దిగువ రెల్లివీధి పంచాయతీ రెల్లికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉత్సవాల్లో భాగంగా గురువారం దుర్గమాంబ అమ్మవారి జెండాను వద్దాది రవి, పురుషోత్తం గృహం నుంచి అమ్మవారి ఆలయానికి తీసుకొచ్చారు. అనంతరం పూజా కార్యక్రమాలు నిర్వహించి జెండా నిలిపారు. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 15న మరిడిమాంబకు పిడతల పండగ, 16న అమ్మవారి గుడిలో ఘటాల పూజ, 18న వద్దాది ఓం అప్పారావు గృహం నుంచి యల్లమ్మతల్లి పండగ జరపనున్నారు. 19న రావులపూడి ప్రసాద్, అన్నపూర్ణమ్మ గృహాల నుంచి పూల ఘటాలతో పోలమాంబను గుడికి తీసుకురానున్నారు. 26న లాంతరు కొయ్య జెండాను పవిత్ర గంగా జలాలతో జెండాను శుద్ధి చేసి పోలమాంబ గుడి వద్ద సాయంత్రం 5 గంటలకు ప్రతిష్ట చేస్తారు. నవంబర్ 5న పోలమాంబ అమ్మవారి ఓడ పండగ, 6న పురవీధుల్లో అన్నఘటాలతో ఊరేగింపు, 8న సాయంతరం 6 గంటలకు పూల ఘటాలతో ఊరేగింపు, 11న అన్నఘటాలు, పూలఘటాలు తిప్పనున్నారు. 20న రంగిరీజు వీధి ముఖద్వారం వద్ద దారి కట్టుట పూజా కార్యక్రమం, 27న తెల్లవారుజాము 3 గంటలకు పురవీధుల్లో ఉజిడి బండితో ఊరేగింపు, తొలేళ్ల కార్యక్రమం, 28న అనుపు కార్యక్రమం చేపట్టనున్నారు. గురువారం నిర్వహించిన కార్యక్రమంలో సంక్షేమ సంఘం అధ్యక్షుడు చెన్నా రవిశంకర్, ఉపాధ్యక్షులు చెన్నా రాజా, చెన్నా గురుమూర్తి, కార్యదర్శి చెన్నా శ్రీనివాస్, కోశాధికారి తుపాకుల తిరుమలరావు, సహాయ కార్యదర్శులు వద్దాది శివప్రసాద్, చెన్నా రామ్‌కుమార్, సహాయ కోశాధికారి టుపాకుల వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

స్వామినాథన్‌కు ఘన నివాళి



స్వామినాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న జానకిరామ్

మహారాణిపేట: భారత వ్యవసాయ శాస్త్రవేత్త, జన్యుశాస్త్ర నిపుణుడు పద్మ విభూషణ్ డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్‌కు ఏపీ మెకనైజెడ్ బోటు ఆపరేటర్స్ అసోసియేషన్ కార్యాలయంలో గురువారం ఘన నివాళులు అర్పించారు. అసోసియేషన్ అధ్యక్షుడు వాసుపల్లి జానకిరామ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ 1960 సంవత్సరంలో భారతదేశంలో వచ్చినటువంటి ఆహార సంక్షోభంలో తినడానికి తిండిలేక వేలాది మంది చనిపోయిన సందర్భంలో స్వామినాథన్ ఐపీఎస్‌లో ఉత్తీర్ణత సాధించినా ప్రజల కోసం వ్యవసాయ శాస్త్రవేత్తగా అనేక ప్రయోగాలు చేశారన్నారు. స్వయంగా ×ఎం.ఎస్.స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్‌ను స్థాపించి వ్యవసాయంలో నూతన అధ్యయనానికి నాంది పలికారన్నారు. జన్యుపరమైన మార్పులతో అధిక దిగుబడి వచ్చే విత్తనాలు రైతులకు అందించి,ఆకలి,పేదరికం తగ్గించడంపై అతను ప్రధానంగా దృష్టి సాగించి ప్రజలకు ఆహార భద్రత ఇచ్చారని అన్నారు. వేటకు వెళ్లే సమయంలో మత్స్యకారులకు సముద్రంలో జరిగే వాతావరణ మార్పులు, ప్రమాదాలను, తుఫానులను ముందుగానే గుర్తించి ఎప్పటికప్పుడు మత్స్యకారులకు మొబైల్ ఫోన్లకు సమాచారం అందించే విధంగా ఎమ్మెస్ స్వామినాథన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వ్యవస్థ అమోఘమన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు దూడపోలయ్య, గుంటు దానయ్య, సిఐఐ న్యూఢిల్లీ ప్రతినిధులు హర్షవర్ధన్ అమిత్, ఆఫ్ కాఫ్ హార్బర్ మేనేజర్ గోవిందరావు, కాకి శ్రీనివాస్, బడే ఎల్లాజీ. గనగళ్ల పోతయ్య తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి

- నగరంలో 15 కూడళ్ల గుర్తింపు
- ప్రత్యేక బందాలతో ట్రాఫిక్ పర్యవేక్షణ
- డీసీపీ–1 శ్రీనివాసరావు



ద్వారకా పోలీస్ స్టేషన్‌లో డీసీపీ-1 శ్రీనివాసరావు

సీతమ్మధార: నగరంలో ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక పర్యవేక్షణ ఏర్పాటు చేస్తున్నట్లు డీసీపీ–1 శ్రీనివాసరావు తెలిపారు. ఫోర్త్‌టౌన్, ద్వారకా పోలీస్ స్టేషన్లను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న మహా విశాఖలో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు నగరంలోని 15 ప్రధాన కూడళ్లు మద్దిలపాలెం, హనుమంతువాక, సిరిపురం, గాజువాక, ఎన్ఏడీ, గోపాలపట్నం, కొమ్మాది, గురుద్వారా, పెందుర్తితోపాటు పలు ప్రాంతాలను గుర్తించామన్నారు. ఉన్నత స్థాయి అధికారులతో ప్రత్యేక బందాలను ఏర్పాటు చేసి ట్రాఫిక్ రెగ్యులేషన్ కోసం చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ట్రాఫిక్ రద్దీ నేపథ్యంలో ఉదయం 8 నుంచి 9.30 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 6.30 గంటల వరకు 15 జంక్షన్ల వద్ద ట్రాఫిక్ లా అండ్ ఆర్డర్, క్రైం, రిజర్వ్ పోలీసులు పర్యవేక్షిస్తారన్నారు. ఫ్రీ లెఫ్ట్ ఉపయోగించకుండా రాంగ్ రూట్‌లో ప్రయాణిస్తున్న వారు, బస్ బేల వద్ద ఆటోలు నిలిపివేస్తున్న వారిపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించి చర్యలు చేపడతామన్నారు. నగర ప్రజలు పోలీసులకు సహకరించి ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు.

రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా

నగరంలోని రౌడీషీటర్లపై, గంజాయి తరలింపు కేసులపై ప్రత్యేక నిఘా పెట్టామని డీసీపీ–1 శ్రీనివాసరావు తెలిపారు. పాత కేసుల్లో ఉన్న వారి వివరాలు సేకరించామని, వారి రోజు వారి విధానాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. నగరంలో అల్లర్లు, గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీసీ కెమెరాల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించామని చెప్పారు. డీసీపీ శ్రీనివాసరావుతోపాటు ద్వారకా ఏసీపీ మూర్తి, ద్వారకా ఇన్‌చార్జి సీఐ భాస్కరరావు, ఎస్ఐ అప్పలరాజు తదితరులు ఉన్నారు.

పేదలకు వరం జగనన్న ఆరోగ్య సురక్ష



జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ తదితరులు

అల్లిపురం: పేదలకు వరం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమమని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. 31వ వార్డు, కృష్ణాగార్డెన్స్‌లో గురువారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు ఈ కార్యక్రమం చాలా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో 31వ వార్డు కార్పొరేటర్ బిపిన్‌జైన్, జేసీఎస్ మండల ప్రెసిడెంట్ దొడ్డి బాపు ఆనంద్, స్టేట్ డైరెక్టర్ సనపల రవీంద్ర భరత్, విశాఖ సిటీ టూ వీలర్స్ అసోసియేషన్ ప్రెసిడెండ్ ఎల్లపు రఘురామ్, రాంబాబు, భవాని, మోహన్, రామరాజు, గద్దిపల్లి అప్పన్న, సచివాలయ సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

'సమస్యలు చెప్పండి..పరిష్కరిస్తా'

అల్లిపురం: 'సమస్యలు ఉంటే చెప్పండి. పరిష్కరిస్తా' అంటూ 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మీ ఇంటికి మీ కార్పొరేటర్ కార్యక్రమంలో భాగంగా ఆమె గురువారం యాతపేట సచివాలయం పరిధిలో వలంటీర్లు చాందిని, లావణ్య, కన్వీనర్లు పిల్లి సత్తిబాబులతో కలిసి ప్రతి ఇంటికి వెళ్లి వారి సమస్యలను తెలుసుకున్నారు.

ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వార్డు నాయకులు లింగం శ్రీను, దూడ అప్పారావు, దుర్గారావు, రాజేష్ పాల్గొన్నారు.